మన్యంలో గజ గజ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత మూడు రోజులుగా గుమ్మలక్ష్మీపురం మన్యంలో చలి ప్రభావం అధికమైంది. మంచు కురుస్తున్న కారణంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు చలికి వణుకుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైన చలి ప్రభావం మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు కనిపిస్తోంది. దూర ప్రాంతం ప్రయాణించాల్సిన వారు సూర్యోదయం తర్వాత బయటకు వెళ్తున్నారు. చలి ఎక్కువ కావడంతో గ్రామాల్లో ప్రజలు చలిమంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు.

విద్యా సంస్థల్లో తాగు నీటి పరీక్షలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో తాగు నీటి పరీక్షలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా తాగునీరు, పారిశుధ్య కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ప్రతి పాఠశాలలో రన్నింగ్ వాటర్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం కావాలన్నారు. మండల స్థాయిలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నోడల్ అధికారిగా ఉంటూ తాగు నీరు లీకేజి ఉండరాదని స్పష్టం చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇళ్లకు తక్షణం మంజూరు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా 122 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సి.ఎస్.సి) పనులు త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్లు డిసెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మండలాలకు మరుగుదొడ్ల ప్రచార సామగ్రి పంపించాలని ఆయన అన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామ పంచాయతీల్లో ఉత్తమ పంచాయతీలను గుర్తించాలని అన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామ దర్శినిలో మరుగుదొడ్ల పైనా ప్రత్యేక దష్టి సారించాలని, విద్యా సంస్థలలోను, స్వయం సహాయక సంఘాల్లోను వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని చెప్పారు. జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు మాట్లాడుతూ జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద రూ.494.53 కోట్లతో 2859 పనులు మంజూరయ్యాయన్నారు. రూ.196 కోట్లతో 1289 పనులను చేపట్టగా, అందులో 732 పనులు పూర్తయ్యాయని, 557 ప్రగతిలో ఉన్నాయని వివరించారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో 15 మండలాల్లో మునగ నర్సరీలు ఏర్పాటు చేసి, 2.50 లక్షల మొక్కలు సిద్ధం చేశామన్నారు. అంగన్వాడీ, పాఠశాలలు, వసతి గహాలు, ఇళ్ల వద్ద నాటేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఉపాధి హామీ కింద పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన చెప్పారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ టి.కొండలరావు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా భూగర్భ జలాల అధికారి ఎ.రాజశేఖర రెడ్డి, ఇరిగేషన్ ఇఇ ఇంజనీరు ఆర్ అప్పలనాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు అయినా గిరిజన ప్రజలు విద్య, వైద్యం, తాగునీరు, రహదారి వంటి మౌలిక వసతుల కోసం ఎదురు చూస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ అన్నారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో మండల సిపిఎం మూడో మహాసభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఉన్న పాలక ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నేటికీ గిరిజనులకు వైద్యం అందని ద్రాక్ష గానే మిగిలిందన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు, మందుల కొరత వెంటాడుతుందని, డోలీమోతలు తప్పడం లేదని అన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యాబోధన సరిగ్గా జరగడంలేదన్నారు. సరైన పాఠశాల భవనాలు లేక విద్యార్థులు బడికి దూరమవుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా వందకు 77 మంది చదువుకుంటే ఏజెన్సీలో 45 మంది మాత్రమే చదువుకున్నారని, దీన్ని బట్టి చూస్తే అక్షరాస్యత చాలా వెనుకబడి ఉందని అన్నారు. సరైన పౌష్టిక ఆహారం లేక శిశు మరణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యాసరాల వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జెమిలి ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారని, దీన్ని సిపిఎం పూర్తిగా ఖండిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడా బిజెపి విధానాలకు వంత పాడుతూ పాలన సాగించడం సిగ్గుచేటన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఎటువంటి ప్రభుత్వానికైనా ప్రజలు బుద్ధి చెప్పక తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమానికి ముందు సిపిఎం జెండాను మండల కమిటీ సభ్యులు బిడ్డిక శంకర్రావు ఆవిష్కరించారు. అనంతరం సీతారం ఏచూరి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, ఇందిరా, మండంగి రమణ, జిల్లా నాయకులు పువ్వుల తిరుపతిరావు, సన్యాసిరావు, మోహనరావు, కె.గౌరీశ్వరరావు, బి.లక్ష్మి, కె చామంతి పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం మండల సిపిఎం నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల కార్యదర్శిగా కోలక అవినాష్, సభ్యులుగా మండంగి రమణ, బిడ్డిక శంకర్రావు, ఎం.సన్యాసిరావు, పి.తిరుపతిరావు, బి.ఆడిత్తు, రమేష్, కృష్ణారావు, అసరయ్య, వెంకట్రావు, చామంతి ఉన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సుబ్బరావమ్మ

కుర్చీ కోసం ఆరాటం

చైర్‌పర్సన్ రాజీనామాతో పెరుగుతున్న ఆశావాహులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ కుర్చీ కోసం పోటీ కనిపిస్తోంది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాల వల్ల తన పదవి రాజీనామా చేయడంతో ఈ కుర్చీ కోసం పోటీ పడుతున్నారు. 20 వార్డులుండగా 17 మంది వైసిపి, ముగ్గురు టిడిపికి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు వైసిపికి చెందిన కౌన్సిలర్ జనసేనలో చేరారు. అయినా మెజార్టీ బలం వైసిపికే ఉంది. చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ కేటాయించడంతో 19వ వార్డుకు చెందిన ఆ కేటగిరి సభ్యురాలికి పదవి కట్టబెట్టారు. నగర పంచాయతీలో 19వ వార్డుతో పాటు 2వ వార్డు కూడా ఎస్సీలదే. అయితే 19వ వార్డు కౌన్సిలర్ రాజీనామా చేయడంతో రెండో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి ఉన్నారు. అయితే చైర్మన్ పదవి వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి హోదాలో ఇస్తారా, లేక వైసిపికి చెందిన రెండో వార్డు కౌన్సిలర్‌కే కట్టబెడతారన్నది కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయంశం అవుతుంది. వైస్ చైర్మన్-1 హనుమంతురావు ఎమ్మెల్సీకి బంధువు. ఆయనకే చైర్మన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది పట్టణంలో చర్చ జరుగుతోంది. వైస్ చైర్మన్-2 పల్లా ప్రతాప్ కూడా ఈ కుర్చీపై ఆశ పెట్టుకున్నట్టు తెలుస్తోంది. కౌన్సిలర్లతో సంబంధాలుండడంతో అధికార పార్టీకి చెందిన కీలకనేత సోదరుడు కావడంతో నగర పంచాయతీలో పనులు చేయించుకోవాలంటే వీలు కలుగుతుందని, కొంత మంది అభిప్రాయపడుతున్నారు. ఇవేమీ కాకుండా రెండో వార్డుకు చెందిన ఆకుల మల్లేశ్వరి చైర్మన్‌గా ఎన్నుకుంటే సరిపోతుందని వైసిపిలోని నేతలు అభిప్రాయపడుతున్నారు.

తక్షణమే నగర పంచాయతీ చైర్పర్సన్‌ను నియమించాలి : సిపిఎం

స్థానిక నగర పంచాయతీకి చైర్‌పర్సన్‌ను తక్షణమే నియమించాలని సిపిఎం పాలకొండ మండల కార్యదర్శి డి.రమణారావు కోరారు. నగర పంచాయతీ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రాధాన్యత పాలకవర్గానికి ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో చైర్పర్సన్ రాజీనామా చేశారన్నారు. కావున పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్ కొనసాగించాలని, ఆ ప్రాతిపదికన చైర్‌పర్సన్ నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

పి.కోనవలసలో నిర్మాణంలో ఉన్న వంటగదిని పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి : పిఒ

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

విద్యా ప్రమాణాలు పెరగాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పాచిపెంట, సాలూరు మండలాల్లో మంగళ వారం పర్యటించిన పిఒ వివిధ పనులను తనిఖీ చేశారు. పాచిపెంట మండలం పి.కోనవలస గురుకులం (బాయ్స్) ను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న వంటగది కం డైనింగ్ హాల్‌ను, కదిరివలసలో గోకులం షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. సాలూరు మండలం కొత్తవలసలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్ (బాలికలు) కిచెన్ కం డైనింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. వైటిసి లో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల హాస్టల్ తనిఖీ చేశారు. వంటగది, డైనింగ్ హాల్ శానిటేషన్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని, ఉపాధ్యాయులు మంచి తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల ఆహారం నాణ్యత ఉండాలని, ఆహార పదార్థాలు తయారీలో అత్యంత జాగరూకత వహించాలని ఆయన ఆదేశించారు. వంటగది, భోజన శాల పరిశుభ్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీల వసతి గృహాన్ని చక్కగా నిర్వహించాలని అన్నారు. గర్భిణీలకు సమయాను సారంగా ఆహారం అందించడం, వైద్య పరీక్షలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ ఎ.మనిరాజ్, డిఇ సంతోష్, పాల్గొన్నారు.

అదనపు కోర్టు మంజూరు

ఫలించిన న్యాయవాదుల పోరాటం

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పట్టణంలో అదనపు కోర్టు మంజూరు చేసింది. గత 40 ఏళ్లుగా అదనపు కోర్టు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక న్యాయవాదులు చేస్తున్న పోరాటం ఇన్నాళ్ళకు ఫలించింది. సాలూరు కోర్టులో అత్యధికంగా సుమారు 3వేలకుపైగా సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్ ఉండగా, ఈ కేసులు పరిష్కరించడానికి ఒక కోర్టు సరిపోదని సాలూరు న్యాయవాదుల సంఘం ఎప్పటినుంచో తీవ్రంగా పోరాడింది. అదనపు కోర్టు మంజూరు గురించి ప్రయత్నం చేస్తున్నప్పటికీ మంజూరు చేయలేదు. ఇంతకాలానికి ఫలించడంతో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతిరావు అనేకసార్లు హైకోర్టు జడ్జిలను, ప్రధాన న్యాయమూర్తులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అతని కృషిని పలువురు న్యాయవాదులు ప్రసంశంసించారు. ఆర్థిక అనుమతికి, హైకోర్టు, ప్రభుత్వలకు ప్రతిపాదనలు పంపించారు. అదనపు కోర్టు మంజూరుపై న్యాయవాదులంతా హర్షం వ్యక్తం చేశారు.

పిజి, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో పిజి, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గ సమస్యలను మంగళవారం అసెంబ్లీ జీరో అవర్లో ప్రస్తావిస్తూ వాటి పరిష్కరించాలని కోరారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులు 120 నుంచి 180 కిలోమీటర్ల దూరాన గల విజయనగరం, విశాఖ వంటి ప్రాంతాలకు పీజీ చేయడానికి వెళ్తున్నారని తెలిపారు. కావున విద్యాశాఖ మంత్రి దీనిపై స్పందించి అనేక ఏళ్లనాటి పీజీ కళాశాల అవసరాన్ని తీర్చాలని విజయ్ చంద్ర కోరారు. అలాగే బలిజిపేట మండల కేంద్రానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యార్థులు అధిక శాతం లో ఉన్నారని, వారు డిగ్రీకి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది కాబట్టి అవసరాన్ని గుర్తించి బలిజిపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆలోచన చేయాల్సిందిగా మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

మరుగుదొడ్లు ఉపయోగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

మరుగుదొడ్లు కలిగి ఉండాలి, వాటిని వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని విక్రమపురంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని, సమాజం మంచి పర్యావరణం, ఆరోగ్యాన్ని కాపాడేందుకు వాటిని నివారించాలని అన్నారు. అలాగే పర్యావరణం కోల్పోవడంతో పాటు నీటి వనరులు కలుషితమై వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మరుగుదొడ్లను సామాజిక గౌరవం కోసం ఉపయోగించాలి, ఆడపిల్లలు, మహిళలు మరుగుదొడ్లను ఉపయోగించడం సురక్షితమని అన్నారు. మరుగుదొడ్ల లీకేజీలను అరికట్టడంతో పాటు కొత్త మరుగుదొడ్ల మంజూరుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం, చెత్తను సముచితంగా నిర్వహణ, చేతులు కడుక్కోవడాన్ని క్రమం తప్పకుండా పాటించాలని తెలిపారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా గ్రామంలో చెరువు సుందరీకరణ పనులు చేపట్టడం అభినందనీయమని, విక్రమపురం మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని గుణాలు కలిగి ఉందన్నారు. ఈ చెరువును బాగా సుందరీకారంగా తీర్చిదిద్దితే ఇక్కడికి ముఖ్యమంత్రిని, ఉపముఖ్యమంత్రిని తీసుకొస్తానని కలెక్టర్ స్థానిక నేతలకు చెప్పడం వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి నిధులు లేకపోయినప్పటికీ గ్రామం అభివద్ధిలో భాగంగా చెరువును అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ శైలజ తెలిపారు. ఇలా ప్రతి గ్రామంలో చెరువుల అభివృద్ధికి గ్రామస్తులు సహకారంతో అభివద్ధి చేసుకొని ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో 20 రోజుల పాటు సర్వే జరిపి అనంతరం మరుగుదొడ్లు లేని వారికి వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో సర్వే జరిపి మరుగుదొడ్లు లేని వారికి మంజూరు చేసి నిర్మాణం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు మంజూరైన లేఖలను కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. హరిత అంబాసిడర్లను సన్మానించారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం, చేతులు శుభ్రం చేసుకునేందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఒ.ప్రభాకరరావు మాట్లాడుతూ కొత్త మరుగుదొడ్ల మంజూరు కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిపిఒ టి.కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ నాగేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్‌మోహన్‌రావు, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిపి ఎస్.శ్యామల, ఎంపిటిసి డి.వెంకటరావు, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మల్లిబాబు, ఎంపిడిఒ మల్లిఖార్జునరావు, ఎంఇఒ నారాయణ స్వామి, ఎన్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం :ప్రతి ఒక్కరూ బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి మరుగుదొడ్డిలను వాడాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు మరుగుదొడ్లు వినియోగంపై పాఠశాలల విద్యార్థులు అధికారులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఆర్డబ్ల్యూస్ జెఇ అర్.వేణుగోపాల్, ఎపిఎం వెంకట్, జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలం నర్సిపురంలో డిఎల్‌డిఒ రమేష్ రామన్ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగం ఆవశ్యకతను ఎంపిడిఒ కె.రూపేష్ వివరించారు. కార్యక్రమంలో ఎఒ రమణమూర్తి, ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటనాయుడు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు ఆధ్వర్యాన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయితీ కార్యదర్శులను సన్మానించారు. సూరంపేట, నిడగల్లు, చినబోగిలి, చల్లమనాయుడు వలసలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పి.పవన్ కుమార్, సర్పంచ్ పొన్నాడ తిరుపతిరావు, అప్పలనరసింహ, ఎపిఒ పి.భాను, మాజీ సర్పంచ్ బొన్నాడ సత్యనారాయణ, గ్రామ పెద్దలు వై.ప్రసాదరావు, బి.శంకర్రావు, సచివాలయ సిబ్బంది. ప్రజలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఎంపిపి కె.దీనమయ్య, సర్పంచ్ ఆర్ చైతన్య స్రవంతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నరేష్ ,వార్డు మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు. అలాగే గుమ్మలక్ష్మీపురంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 గడ్డికాలనీ వద్ద మరుగుదొడ్లు, తాగునీరు మంజూరు నిర్మాణానికి సర్పంచ్ బి.గౌరీశంకరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, ఆర్డబ్ల్యూఎస్ జెఇ ప్రవీణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరరావు ఉన్నారు.

సీతంపేట : వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా స్థానిక హైస్కూల్ నుంచి పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, సర్పంచ్ ఎ.కళావతి, కార్యదర్శి రామకృష్ణ, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపిపి, సర్పంచ్, పలుశాఖల సిబ్బంది

ఎం.సింగిపురంలో సర్వేను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

ఎన్‌సిడి సర్వే పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పాలకొండ

ఎన్‌సిడి సర్వేను వైద్య సిబ్బంది పక్కాగా నిర్వహించి వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయపార్వతి సూచించారు. ఈ మేరకు మండలంలోని ఎం.సింగుపురం పిహెచ్‌సి పరిధిలో గల నవగాంలో వైద్య సిబ్బంది చేపడుతున్న ఎన్‌సిడి సర్వేను ఆమె పరిశీలించారు. వ్యాధి లక్షణాలు, ఆరోగ్య పరీక్షల ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఏ విధంగా గుర్తిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగారు. అక్కడ నిర్వహిస్తున్న వైద్య తనిఖీలను ఆమె పరిశీలించారు. ఎన్‌సిడి మొబైల్ యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయపార్వతి మాట్లాడుతూ వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులు తీవ్రమయ్యే వరకు గుర్తించలేని పరిస్థితి తలెత్తకుండా, ఇంటింటి సర్వే చేపట్టి 18ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు జరిపి సత్వరమే వ్యాధిగ్రస్తులను ప్రారంభంలోనే గుర్తించాలని అన్నారు. ఈ సర్వేలో వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి మధుమేహం, రక్తపోటు, కేన్సర్, మూర్ఛ రోగం, లెప్రసీ, టిబి, సిఒపిడి మొదలగు అసంక్రమణ, సంక్రమణ వ్యాధులను గుర్తించాలని, అలాగే ఇంతముందు నుంచే ఈ వ్యాధులకు చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం పర్యవేక్షించాలని సూచించారు. కేన్సర్ పరీక్షలు అందరికీ జరపాలని, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తిస్తే వ్యాధితీవ్రత చెందకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా రవికుమార్, డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ పట్టణ సమస్యలపై తన గళం వినిపించారు. పాలకొండ నగరపంచాయతీకి సంబంధించి ముఖ్యంగా తాగునీరు, డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ రెండు సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం చాలా ఉందని అయన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. పాలకొండ నగర పంచాయతీలో చెత్త సేకరించి వేసేందుకు గానూ డంపింగ్ యార్డ్ లేనందున, డంపింగ్ యార్డ్ కొనుగోలు చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుండి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే నాన్ - అమృత్ పథకం కింద రూ.57.50 కోట్లతో రక్షిత తాగునీరు సరఫరా పథకం మంజూరైనా సదరు పనిలో 6 కిలోమీటర్ల పరిధిలో పైపు లైన్ పనులు పూర్తయి, మిగిలిన పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ పనులను కొత్తగా ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రాప్తికి అంచనాలు సవరించి కొత్త అంచనా విలువతో మంజూరు చేసి పాలకొండ నగర పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చాల్సిందిగా మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణను అసెంబ్లీ జీరో అవర్లో కోరారు.

పాచిపెంటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అవయవదాతకు నీరాజనం

ప్రజాశక్తి - పాచిపెంట

అవయవదాత సాయిశ్రీనివాస్‌కు పాచిపెంట మండల కేంద్రంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి నీరాజనం పలికారు. మండలంలోని కొత్తవలసకు చెందిన లంకేన సాయికుమార్ మృతి చెంది నలుగురికి అవయవదానం చేయడంతో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ యడ్ల రమేష్, ఉపాధ్యాయులు పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు గుండా పెద్ద బజార్ సామాజిక భవనం వరకు సాయికుమార్ ఫ్లెక్సీలు చూపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. సాయికుమార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం కొద్దిసేపు సాయి కుమార్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ప్రసాద్ బాబు, రమేష్ మాట్లాడుతూ సాయికుమార్ మృతి అందర్నీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అయితే అవయవ దానం చేస్తూ అతని తల్లిదండ్రులు చూపిన చొరవ నలుగురు ప్రాణాలను కాపాడడమే కాకుండా ఎంతోమందికి ప్రేరణగా మారిందన్నారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక వైద్యంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఆయుర్వేదిక్ వైద్య విధానంపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద్దఅంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో బూర్జ ఆయుర్వేదిక వైద్యంపై వైద్యాధికారి టి.హేమాక్షి ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ముఖ్యంగా మధుమేహ నియంత్రణ దినచర్య, రుతు చర్య, జీవనశైలి యోగపై అవగాహన కలిగించారు. గ్రామాల పరిసర ప్రాంతాల్లో దొరికే ఔషధ మొక్కల కోసం వివరించారు. ఆ మొక్కల ప్రాముఖ్యత గృహ వైద్యం వివరించి వాటికి సంబంధించిన పుస్తకాలను, కరపత్రాలను ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇఒ సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మి, హెచ్‌ఎస్ గోపాలరావు, వైద్య, ఆయుర్వేదిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంబర వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహం, రక్తపోటు, జ్వర పీడితులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు, పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ డిగ్రీ కాలేజీలో బిర్సా ముండా వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోస్టు మెట్రిక్ డిగ్రీ కళాశాలలో భగవాన్ బిర్సా ముండా 150 వేడుకలు మంగళవారం వార్డెన్ సాంబమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ ఆదిమ జాతుల స్వాతంత్ర్య పోరాట యోధుడు గిరిజన జానపద నాయకుడు భగవాన్ బిర్సా ముండా అతి చిన్న వయసులోనే బ్రిటీష్ సామ్రాజ్యంపై గిరిజనులు సాగు చేసిన భూమి, భుక్తి, పన్నుల కోసం అలుపెరగని పోరాటం చేసిన వయస్సులోనే మరణించడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన దేవాదాయశాఖ అధికారి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి ఆలయాలను జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి సంబంధించి దేవాదాయశాఖ తరపున ప్రణాళికలు తయారు చేసే క్రమంలో ఈ ఆలయాలను సందర్శనకు వచ్చినట్లు తెలిసింది. కార్యక్రమంలో సాలూరు దేవాదాయ శాఖ ఇఒ రమేష్, ఎఇ జగపతిరావు, జూనియర్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల గ్రామ సచివాలయంలో ఇదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనర్హులు 2018-19లో టిడిపి ప్రభుత్వ హయాంలో అర్హులుగా గుర్తించి పింఛన్లు పొందినట్లు అదే గ్రామానికి చెందిన యామక అప్పలనాయుడు లోకాయుక్త ఫిర్యాదు చేయడంతో మంగళవారం డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ విచారణ చేపట్టారు. లోకాయుక్తలో పింఛను తొలగింపుతో పాటు లబ్ధిపొందిన వారి నుంచి రికవరీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు డిఎల్‌డిఒ తెలిపారు. ఆరుగురు వృద్ధాప్య, ఒకరు ఒంటరి మహిళ పింఛను దాదాపుగా రూ.2,12,750 అప్పట్లో వీరికి పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల నుంచి వివరాలు నమోదు చేసి రికార్డ్ చేశారు. ఆయనతో పాటు ఎంపిడిఒ బి.వెంకటరమణ, తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు. స్థానిక గవర్నమెంట్ హై స్కూల్ లో సుమారు 40 మంది విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్లు శివకుమార్, లక్ష్మణరావు, వెంకటరత్నం, ప్రసన్న కుమారి, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

సంపద కేంద్రాల నిర్వహణపై చొరవ చూపాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక చొరవ చూపాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించేందుకు బాధ్యత వహించాలన్నారు. స్వర్ణ పంచాయతీ, వరల్డ్ టాయిలెట్స్ డే, హౌస్ ఓల్డ్ జియో టాగింగ్ తదితరమైనవి వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

సర్వేల్లో పురోగతి సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వార్డు, గ్రామ సచివాలయాల ప్రత్యేకాధికారి రామగోపాల్

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

సర్వేల్లో పురోగతిని సాధించాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లా నోడల్ అధికారి, సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఎసి) శ్రీనివాసరాజుతో కలిసి పట్టణ పరిధిలో గల 15 వార్డు సచివాలయాలకు చెందిన అన్ని విభాగాల సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సెక్రటరీలకు తాను పరిచయం చేసుకుంటూ వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, సచివాలయాల్లో బయోమెట్రిక్ ఎన్నిసార్లు అని అడగ్గా ప్రతిరోజు మూడుసార్లు వేస్తున్నట్టు కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌పిసిఐ సర్వే, హౌస్ హెూల్డ్ జియో కోఆర్డినేట్స్ క్యాప్చరింగ్ సర్వేను వార్డ్ సచివాలయాల సెక్రటరీలంతా సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి పురోగతి సాధించాలని సూచించారు. సాంకేతిక సమస్యలుంటే తమకు నేరుగా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా సెక్రటరీలు ప్రత్యేక అధికారి దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. పట్టణంలో 271 క్లస్టర్లు ఉన్నాయని, దీనికి సంబంధించి 15,700 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలోను, సంక్షేమ పథకాల అప్లోడ్ విషయంలోను పూర్తిస్థాయిలో స్కానర్లు లేవని ఉన్న సగం స్కానర్లుకు రీఛార్జ్ అవ్వడం లేదని, గతంలో చేపట్టిన సర్వే తర్వాత కొందరు వలస వెళ్లిపోయారని, వారిని ఇప్పుడు సర్వే చేయడం ఇబ్బందిగా ఉందని ఈ విషయంపై సాంకేతికంగా సమస్యలు వస్తున్నాయని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రీ సర్వే విధానం, తదితర నమోదు విషయంలో సర్వర్ సమస్య ఉందని అన్నారు. అలాకాకుండా జిల్లాల వారీగా కొన్ని రోజులు కేటాయిస్తే సాంకేతిక సమస్య ఉండదని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, మేనేజర్, మున్సిపల్ పరిధిలో ఉన్న 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదించిన జాతీయ నాణ్యతా ప్రమాణాలను ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేయాలని స్టేట్ ప్రోగ్రాం అధికారి (ఎన్‌క్యూఎఎస్) డాక్టర్ పి.రమాదేవి స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సిహెచ్‌ఒ (ఎంఎల్ హెచ్ పి)కు స్టేట్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్స్ మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సిలు, సబ్ సెంటర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఉండాల్సిన మౌలిక సదుపాయాలు, ఆసుపత్రుల పనితీరు, రోగులు ఆసుపత్రికి వచ్చి తిరిగి వెళ్లే వరకూ అవసరమైన చికిత్స, మందులు, సరైన దిశా నిర్దేశం, ఇతర మౌలిక సదుపాయాలైన తాగునీరు, టాయిలెట్స్, ఆవరణ పరిశుభ్రత విషయంలో నాణ్యతా ప్రమాణాలు, మార్గదర్శకాలు పాటించి వాటి మెరుగునకు కృషి చేయాలన్నారు. ఇందులో పరిష్కరించాల్సిన అంశాలను ఏమైనా ఉంటే డాక్యుమెంటేషన్ రూపంలో ఏవిధంగా పోర్టల్ లో అప్లోడ్ చేయాలో ప్రెజెంటేషన్ ద్వారా టీమ్ వివరించడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన వైద్యాధికారులు, సిహెచ్‌ఓ లు వారి పరిధిలో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించే లక్ష్యంగా వైద్య సిబ్బందికి %చీూూ% రీఓరియన్టేషన్ శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ (ఎన్‌క్యూఎఎస్) కన్సల్టెంట్ డా. జి నరేంద్ర కుమార్, డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహన్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్స్ కె. శ్రీనివాస్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

పని వేళల పెంపుతో ప్రయోజనం లేదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని హైస్కూళ్ల పని వేళలను ఒక గంట పెంపు వల్ల ప్రయోజనమేమీ లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ ఒక ప్రకటనలో చెప్పారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ ప్రస్తుతం హైస్కూళ్ళలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు పని చేయడం వల్ల ఎనిమిది పీరియడ్స్ నడుస్తున్నాయని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు పని వేళల పెంపు వల్ల కూడా అవే 8 పీరియడ్స్ ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ ఉదయం 9నుంచి 10 వరకు, సాయంత్రం 4నుంచి 5వరకు జరుగుతున్నాయని చెప్పారు. పని వేళల పెంపు వల్ల ప్రయోజనం లేనందున దీన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందని మురళీమోహన్ రావు ఆ ప్రకటనలో తెలిపారు.

దాణా తయారీలో స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దాణా తయారీలో రైతులు స్వయం సమృద్ధి సాధించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. మండలంలోని నర్సిపురంలో స్థానిక పశు వైద్య కేంద్రంలో ఉచిత పశు వైద్య శిబిరం, పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు పాల్గొని, పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశుగ్రాసం ప్రాముఖ్యతను తెలిపారు. ఉపాధి పథకం ద్వారా పశు గ్రాసాల సాగుకు సంబంధించిన విషయాలను వివరించారు. అజోళ్ల, సైలేజ్ తయారీ, సమీకృత దాణాను రైతులు స్వయంగా తయారు చేసుకొనే విధానాన్ని, దాని ప్రాముఖ్యత గురించి తెలిపారు. స్వయం సమృద్ధి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పశువుల పెంపకంలో మెలకువలను, పశు పిండ మార్పిడి ప్రాముఖ్యతను, లింగ నిర్ధారణ చూడి ఇంజక్షన్లు, నట్టల నివారణ మందు ఉపయోగాలు వివరించారు. ఈ శిబిరములో 102 పశువులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.రాధాకష్ణ, పార్వతీపురం సహాయ సంచాలకులు డాక్టర్ బి.శ్రీనివాసరావు, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ జె.కిరణ్, పశు వైద్యులు రామారావు, బి.చక్రధర్, ఉదయ్, ప్రసాద్, సత్యనారాయణ, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ అను, సర్పంచ్ బంగారం, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా ఫొటోలు మార్చరా?

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి ప్రభుత్వం పోయి, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిపోయాయి. అయినప్పటికీ, రేషన్ ఇచ్చే వాహనాలపై జగన్ స్టికర్ తీయలేదు. పాలకొండ నగరపంచాయితీ పరిధిలో రేషన్ వాహనాలపై ఇంకా జగన్ నవరత్నాలు స్టిక్కర్ తోనే దర్శనమిస్తున్నాయి. ఇది చూస్తున్న ప్రజలు ఇంకా స్వామి భక్తి పోలేదా, ఇంకెన్నాళ్లు జగన్ నామ స్మరణలో ఉంటారో అని చర్చించు కుంటు న్నారు.

రేషన్ బండిపై ఉన్న జగన్ ఫొటో

కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - కొమరాడ

అధికారుల పత్రిక ప్రకటనలు తప్ప మండలంలో ఎక్కడా రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర అన్నారు. మండలంలోని కొమరాడ, గంగరేగువలస, కుమ్మరగుంట, గుణానపురం పంచాయతీల్లో రైతులు సేకరించిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన క్వింటా మద్దతు ధర రూ.2300కు ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని సిఎం ఆదేశించినా మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు నేటి వరకు ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల రైతులు ఇప్పటికే తాము పండించిన ధాన్యాన్ని దళారులకు 104కేజీ రూ.1800కు, 81 కేజీ రూ.1415కు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులు దళారులకు ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28లోగా రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, లేకుంటే రైతులందరితో కలిసి భవిష్యత్తులో సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నూతన బోధనా పద్ధతులు అమలు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో అవగాహన చేసుకున్న నూతన బోధనా పద్ధతులను తరగతి గదిలో అమలు చేయాలని ఎంఇఒ- 1 సామల సింహాచలం అన్నారు. మంగళ వారం ఆయన బలిజిపేట స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. స్కూల్ కాంప్లెక్స్ జరుగుతున్న విధానాన్ని, ఉపాధ్యాయులు ఎంతవరకు అవగాహన చేసుకున్నారనే అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకోవాలని, నూతన విద్యా విధానాలను అవగాహన చేసుకుని విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. ప్రతి ఉపాధ్యాయుడు టీచర్స్ డైరీ, లెస్సన్ ప్లాన్స్ తయారు చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ పెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నడిమికెళ్ల సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌస్‌హోల్డ్, జియోటాగింగ్, వరల్డ్ టాయిలెట్స్ డే, స్వర్ణ పంచాయితీ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయనతో పాటు సర్పంచ్ డోకల సుజాత, శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి జి.రూప, సిబ్బంది ఉన్నారు.

బాలలకు చట్టాలపై నేడు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

బాలబాలికలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20న అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెలగాం ఎంజెపి స్కూల్‌లో మధ్యాహ్నం 3గంటలకు న్యాయపరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బాలబాలికలు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

విత్తన కంపెనీలతో ఒప్పందం చేసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

మొక్కజొన్న విత్తన కంపెనీలతో రైతులు ఒప్పందం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ చెప్పారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయంలో సీడ్ కంపెనీల ప్రతినిధులు, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పంపిణీ చేసిన మొక్కజొన్న విత్తనాలు ఒకవేళ మొలకెత్తకపోతే కంపెనీలే బాధ్యత వహించాలన్నారు. రైతులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో కంపెనీల ప్రతినిధులతో ఒప్పందం చేసుకోవాలని సూచించారు. పాచిపెంట మండలం విశ్వనాథపురం, సాలూరు మండలం నంద గ్రామాల్లో మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తకపోతే కంపెనీల నుంచి పరిహారం ఇప్పించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎడి మధుసూదనరావు, ఎఒ అనురాధ పాండా, విఎఎలు పాల్గొన్నారు.

సీతంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నాయుడు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, మంచి సమాజాన్ని ఏర్పాటు చేయడంలో విద్యార్థులు కీలకమని టౌన్ పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ బడ్నాన శశి అన్నారు. మంగళవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ క్రైం చట్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేదాంత జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు, కళాశాల సిబ్బంది, హెూంగార్డు అర్చన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక గాయత్రీ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం, ట్రాఫిక్ నిబంధనలకు ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు అవగాహన నిర్వహించారు. అలాగే చినబోగిలి జంక్షన్లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగిస్తే కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. అనంతరం కాలేజీలో ఫిర్యాదుల బాక్స్ అమర్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరులో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు, మండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి మాట్లాడుతూ ఎంటియు 1224 సాగు చేయాలని సూచించారు. ఈ రకం దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో పెద్దూరు, మండ సర్పంచులు, ఎఎంసి చైర్మన్, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విఎఎ జోత్స్న పాల్గొన్నారు.

కత్తెర పురుగు పట్ల జాగ్రత్త పడాలి

పాచిపెంట : మొక్కజొన్న వేసే రైతులంతా కత్తెర పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. ఈ పురుగు విత్తనం నాటిన వారం రోజుల తర్వాత గుడ్డు దశ నుంచే నివారించుకోవాలని సూచించారు. మండలంలోని మిర్తివలసలో రైతులు మొక్కజొన్న పంటపై ఆశించే కత్తెర పురుగు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పోలి నాయుడు, విఎఎ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా రామారావు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షునిగా కూరంగి రామారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా మూటక ఎండయ్య ఎన్నికైనట్లు మేనేజర్ దాసరి కృష్ణ తెలిపారు. డైరెక్టర్లుగా ఎండయ్య, సింహాద్రి. శ్రీనివాసరావు, బలరాం, రత్నాలమ్మ డైరెక్టర్లుగా నియమించినట్లు తెలిపారు.

పిఎంఎవై గ్రామీణ 2.0పై సర్వే

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో పిఎంఎవై ప్రధానమంత్రి ఆవాస యోజన గ్రామీణ 2.0 పథకంపై సర్వే చేపట్టాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు స్థానిక ఐటిడిఎలో మంగళవారం కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంఎవై సర్వే శరవేగంగా పూర్తి చేయాలని అన్నారు. గతంలో గృహాలు పొందని లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సర్వే రిపోర్ట్ మొబైల్ యాప్‌లో పొందుపర చాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు అనసభద్ర విద్యార్థులు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల మధ్య జరగనున్న క్రీడా పోటీలకు అనసభద్ర ఏకలవ్య పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ బి. ఎర్రునాయుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని ఎర్రసామంత వలస నుండి సుమారు 50 మంది విద్యార్థులు ఈ పోటీలకు మంగళవారం బయలుదేరినట్టు తెలిపారు. అండర్-14, 19 విభాగాల్లో పలు క్రీడల్లో మీరంతా పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు ఆనసభద్ర ఏకలవ్య పాఠశాల పేరున నేషనల్ వాలీబాల్ విజేత గుర్తింపు పొంది ఉందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులంతా మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

700 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని పెదబొండపల్లిలో గ్రామ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ ప్రొబిషనరీ శాఖ పోలీసులు నిర్వహించిన దాడుల్లో మండలం ఆడవారు గ్రామానికి చెందిన మండంగి శ్రీరాములు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 600 నాటు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీలో దాడులు నిర్వహించి 100 సారా ప్యాకెట్లతో గొడగలవీధికి చెందిన బొత్స హరికృష్ణను అరెస్ట్ చేసి, సారాను స్వాధీన పర్చుకోవడం జరిగింది. ఈ ఇద్దరి నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు ఎక్సైజ్ సిఐ సురేష్ తెలిపారు.

సీతానగరం : గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేట వద్ద గస్తీ నిర్వహించగా, ఒక నాటు సారాయి కేసును నమోదు చేసినట్టు స్థానిక ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 300 నాటు సారాయి ప్యాకెట్లు స్వాధీనపర్చుకున్నట్టు తెలిపారు. అనంతరం ముద్దాయిని 14 రోజులు జ్యూడిషియల్ కస్టడీకి పంపించామన్నారు.


సంజీవనాయుడుని సన్మానిస్తున్న గ్రంథాలయ సంఘం సభ్యులు

సంజీవనాయుడికి సేవారత్న

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకికి చెందిన నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సేవలకు గానూ సేవా రత్న అనే బిరుదును విజయనగరంలో గల గురజాడ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సంజీవనాయుడుకు సేవారత్న బిరుదుతో పాటు రెడ్డి రమణ స్మారక పురస్కారాన్ని మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకరరావు, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవాధ్యక్షులు ఎస్ ఎస్ ఎస్ రాజు, గ్రంథాలయ సేవా సంఘం అధ్యక్షులు ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు దయానంద్, గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవుఫ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఎడిసిఎల్ నాగేశ్వరావు చేతులు మీదుగా సంజీవనాయుడ్ని సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణానికి చెందిన సాహితీ అభిమానులు, పెదపెంకికి చెందిన నల్ల శివ, టి.రాము. మధు పాల్గొన్నారు.


కురుపాంలో ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - కురుపాం

భారత మాజీ ప్రధానిమంత్రి ఇందిరా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి అడ్డాకుల చిన్నారావు ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘంగా అధ్యక్షులుగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన సమయంలో భారత ప్రజలకు ఆమె అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆమె చూపిన ప్రేమ, అభిమానం, త్యాగం భవిష్యత్తు తరాలకు నాందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకష్ణ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు ఇందిరాగాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.